క్లుప్తంగా

గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ బాలేశంగౌడ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్ బీఆర్‌ఎస్ ఎంపీపీ బాలేశంగౌడ్, మాజీ సర్పంచ్ కరుణాకర్ గురువారం గాంధీ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి సీఎం కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందని, నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయమన్నారు. లోక్ సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సైబర్ అంబాసిడర్లకు బ్యాడ్జీల బహూకరణ



పాఠశాల సైబర్ అంబాసిడర్లతో ఎస్‌ఐ మహేష్ తదితరులు

హుస్నాబాద్: సైబర్ సెక్యూరిటీలో భాగంగా సైబర్ అంబాసిడర్లుగా ఎంపికైన హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఎస్‌ఐ మహేష్ బ్యాడ్జీలను బహూకరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు టెక్నాలజీని అనుసరిస్తూ సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సంభవిస్తే వెంటనే షీటీం సహాయం తీసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌కు అలవాటుపడి సమయం వృథా చేసుకోకుండా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, షీటీం ఎస్‌ఐ సదయ్య, ఉపాధ్యాయులు రాజమల్లు, శ్రీనివాస్, వెంకటరమణా రెడ్డి, వీరారెడ్డి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

జగదేవ్‌పూర్(జగదేవ్‌పూర్): ప్రభుత్వ భూములు, భవనాలను అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం జగదేవ్‌పూర్ గ్రామ ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి మాట్లాడుతూ జగదేవ్‌పూర్‌లోని అంబారెడ్డి, రెడ్డమైన, ధర్మాయకుంట, దేవతల చెరువుల కబ్జాకాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు కుంటలను సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మల్లేశం, మునీర్, బాల్‌నర్సయ్య, జహంగీర్, సలీం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ జయదేవ్ అన్నారు. గురువారం మండలంలోని అంగడికిష్టాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలన్నారు. ఈ సీజన్ నుంచి కొత్తగా ఐరిష్ విధానం ద్వారా రైతుల వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం వాసుదేవ్, ఏపీఎం కిరణ్, సీసీలు, వీఓఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

జైలు, జరిమానా

సిద్దిపేటరూరల్: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ చెప్పులతో కొట్టిన కేసులో జడ్జి ఇద్దరికి జైలు, జరిమానా విధించినట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2016 జనవరి 20వ తేదీన మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన గ్యార చంద్రకళ-రవి కూతురు రమ్య ఇంట్లో ఒక్కరే ఉండగా గ్యార వెంకటమ్మ, గ్యార శ్రీనివాస్ పాత కక్షల కారణంగా ఇంట్లోకి ప్రవేశించి దుర్భాషలాడుతూ చెప్పులతో కొట్టారు. రమ్య తల్లి చంద్రకళ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో ఇద్దరిపై నేరం రుజువు కావడంతో గురువారం జడ్జి 6 నెలల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారు.



అంతక్కపేట శివారులో వేప వృక్షాలను కూల్చివేస్తున్న దృశ్యం



రవాణాకు సిద్ధంగా చేసిన కలప

పట్టించుకోరు.. సంరక్షించరు

అక్కన్నపేట(హుస్నాబాద్): తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా కలప వ్యాపారి చెట్లను నరికి కోత మిల్లుకు తరలిస్తుండగా, రైతులు కుంటను కబ్జాచేసి పంటలు సాగుచేస్తున్నారు. అక్కన్నపేట మండలం అంతక్కపేట శివారులోని పాల డెయిరీ పక్కన కుంటకట్టపై చెట్లను నరికి కోత మిల్లుకు తరలిస్తున్నారు. హుస్నాబాద్‌కు చెందిన కట్టె మిషన్ వ్యాపారి గురువారం భారీ వేప వృక్షాలను నేలమట్టం చేయించి తన మిల్లుకు తరలించాడు. అలాగే ఈ కుంట శిఖం భూమి సైతం కబ్జాకు గురైంది. కుంట చుట్టూ ఉన్న రైతులు వరి సాగు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ మధుసూదన్‌కు సాక్షి సంప్రదించగా కుంట కట్టపై వృక్షాలను నరికిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించండి

జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణ కేంద్రంలోని కార్యాలయంలో ముస్త్యాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించేందుకు చేర్యాల ప్రాంత కార్యకర్తలందరూ కదలిరావాలన్నారు. దేశ వ్యాప్తంగా మతోన్మాదాన్ని నింపుతున్న బీజేపీని అభ్యర్థులను ఓడించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే ప్రసవాలు జరిగే విధంగా వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా ఆరోగ్య నర్సింగ్ అధికారి (డీపీహెచ్‌ఎన్‌ఓ) ఏసుమేరీ అన్నారు. గురువారం మండలంలోని లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్యసేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ ప్రోత్సహకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలను అందించాలన్నారు. వైద్యసేవల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే పీవో, డీడీవో డాక్టర్ సుధీర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీహెచ్‌ఎన్‌వో ఏసుమేరీ

అమ్మల దయతో అందరం బాగుండాలి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెద్దమ్మ, ఎల్లమ్మ తల్లుల దయతో అందరం బాగుండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, గాడిచెర్లపల్లిలో ఎల్లమ్మ తల్లి సిద్ధయోగం కార్యక్రమాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరీశ్‌రావుకు ఆయా ఆలయాల నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. సిద్దిపేటలో హరీశ్‌రావు మాట్లాడుతూ పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.32 లక్షలు మంజూరు చేసిందన్నారు. అమ్మవార్ల అనుగ్రహంతో సిద్దిపేట దిన దినాభివృద్ధి చెందుతోందన్నారు. గాడిచెర్లపల్లికి పట్టణ హంగులు తెచ్చామని తెలిపారు. నాలుగు వరుసల రోడ్డు, సిమెంట్ రోడ్లు, గుడి, అంబేద్కర్ భవన్, ఫంక్షన్ హాల్ అందుబాటులోకి వస్తున్నాయన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావును ఘనంగా సన్మానించారు.



పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చాం

సిద్దిపేటరూరల్: గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుని సిద్దిపేటకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చామన్నారు. గురువారం నారాయణరావుపేట మండల పరిధిలోని మల్యాల గ్రామంలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



సింగన్నగూడ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

జిల్లా వైద్యాధికారి శ్రీనివాస్

ములుగు(గజ్వేల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ములుగు మండలం సింగన్నగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వడదెబ్బ నివారణకు కావలసిన ఓఆర్‌ఎస్, గ్లూకోజ్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.


బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ ఓబీసీ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని గురువారం నియమించినట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని సతీష్ తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పాంపడిగే వేణు, బత్తిని కనకయ్య గౌడ్, నిమ్మల శ్రీనివాస్, పెండ్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా గర్నెపల్లి కృష్ణమూర్తి, సుంకోజు ప్రవీణ్, బాదన్నగారి యాదన్ రావు, కార్యదర్శులుగా బండికాడి భిక్షపతి, నీరటి మహేందర్, భోగి శ్రీనివాస్, శాంకరి సంతోష్, బొల్లు సందీప్, కమ్మరి స్వామి, అధికార ప్రతినిధులుగా కంపి శంకర్, అన్నబోయిన యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా రంగసమైన కుమార్, ఎగ్గోజు శ్యాం నియమితులైనట్లు అధ్యక్షులు పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా రంజిత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఆముదాల రంజిత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 5వ జిల్లా మహాసభ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేర్యాల ప్రాంతానికి చెందిన అత్తిని హారిక, పుర్మ రాకేష్‌రెడ్డి, నాగపురి కిరణ్, సుద్దాల భాస్కర్, తాడూరి భరత్, సంజుయాదవ్‌లకు జిల్లా కమిటీలో చోటు దక్కింది.

వైభవంగా బీరప్ప కామరతి కల్యాణం



ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

చేర్యాల(సిద్దిపేట): గొల్ల కురుమల ఆరాధ్య దైవం బీరప్ప, కామరాతి కల్యాణ మహోత్సవం మండల పరిధిలోని ఆకునూరులో గురువారం జరిగింది. గొల్ల కురుమలకు బీరప్ప పెద్ద పండుగ. వారం పాటు ఆకునూరు గ్రామంలో అక్క మహంకాళి ఆశీర్వాదంతో జరిగిన బీరప్ప-కామరాతి, చౌడలమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవాలు ముగిశాయి. ఐదు దశాబ్దాల తర్వాత ఆకునూరులో జరిగిన బీరప్ప పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. మంద పోచమ్మకు చేయుట, లింగాలకు ఆట పాటలతో గంగకు వెళ్లడం, బీరప్ప కల్యాణం, మంద మీద సరుగు వేయడం, కాశీ రామక్క కథ, గారడి వేషం, నాగవెల్లి బోనాలు, అక్క మహంకాళి, బీరప్ప కామరాతి వేషధారణలో కథలు చెప్పడం వంటి కార్యక్రమాలు జరిగాయి.

మాంజాదారం హానికరం



మాంజాదారంపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: పతంగులు ఎగురవేసేవారికి నైలాన్ సింథటిక్ మాంజాదారం కాకుండా కాటన్ దారం విక్రయించాలని పట్టణంలోని దుకాణదారులకు గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అవగాహన కల్పించారు. పట్టణంలో మంజాదారం నిషేదించామన్నారు. నైలాన్ సింథటిక్ మాంజా క్రయవిక్రయాలు చేయొద్దన్నారు. స్కూల్ పిల్లలు పతంగులను ఎగురవేసేటప్పుడు మాంజాదారం కాకుండా కాటన్‌దారం వాడాలని సూచించారు. మాంజా రసాయనాలతో తయారు చేయడం వల్ల మనుషులు, పక్షులు, పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. అంతేకాకుండా బయోడీగ్రేడబుల్ కాదని, షార్ప్‌గా ఉండటంతో పక్షులు, మనుషులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారులు ఎవరైన మాంజా ఎగుమతి, దిగుమతి చేసుకున్నట్లయితే పర్యావరణ చట్టం 1986, వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆత్మీయ సమావేశానికి తరలిరావాలి

బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేట లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా నిర్వహించే ఆత్మీయ సమావేశానికి విద్యార్థులు, యువతీ యువకులు తరలిరావాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం పాలమాకులలో విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేటలో ఈనెల 7వ తేదీన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి జనం తరలివచ్చేలా మండల నాయకులు కృషి చేయాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గోవిందారం రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

బీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం

సిద్దిపేటఅర్బన్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని బీఎస్‌ఆర్‌కేఎస్ భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే పార్లమెంటు ఎన్నికల్లో తమ సంఘం అభ్యర్థిని నిలబెడుతున్నామని తెలిపారు. 14 రంగాల కార్మికులు ఏకమై భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున బరిలో నిలిచి అభ్యర్థికి మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు ఐరేని ముకుందం, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు

గజ్వేల్‌రూరల్: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని గజ్వేల్ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జై శ్రీరామ్ అంటే ఉద్యోగాలు రావని, అది కడుపు నింపదని, జైశ్రీరామ్ అనకూడదని చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. కేటీఆర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్లు బండారు మహేష్, ఎల్కంటి సురేష్, పార్టీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు హర్షణీయం

మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ముదిరాజ్‌లకు సభ్యత్వాలు ఇవ్వాలని ఆదేశిస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, గౌరవ అధ్యక్షుడు జగన్ మోహన్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్ ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాజీపూర్‌లో 18 వర్గాల కులస్తులు ముదిరాజ్ కులస్తులను సామాజిక దూరం పెట్టడంతో ముదిరాజ్‌ల తరపున అడ్వకేట్ బీఎల్ పాండు ముదిరాజ్ గత మంగళవారం హైకోర్టులో వాదనలు వినిపించారన్నారు. వాదోపవాదనలు విన్న న్యాయస్థానం ముదిరాజ్‌లకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. తమ సమస్యకు కోర్టుకు వివరించి న్యాయం జరిగేలా వాదించిన న్యాయవాది పాండు ముదిరాజ్‌కు మెపా రాష్ట్ర జిల్లా కార్యవర్గాలు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ కరపత్రాల పంపిణీ

హుస్నాబాద్: లాభార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలో బీజేపీ నాయకులు నేరుగా కేంద్ర పథకాల లబ్ధిదారులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కి ఓటు వేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, పీఎం స్ట్రీట్ వెండర్స్, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర పథకాల ద్వారా లబ్ధిపొందినవారిని కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, పట్టణ మాజీ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, నాయకులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధిని చూపి ఓట్లు అడగండి

హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీ లేదని, అభివృద్ధిని చూపి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల పేరిట బండి సంజయ్ దొంగ దీక్షలు చేస్తున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ మృత్యుంజయ హోమం

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలోని సత్య సాయి ప్రశాంతి నికేతనం మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం లోక కల్యాణం కోసం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మృత్యుంజయ మంత్రాన్ని జపించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పూర్ణిమ మాట్లాడుతూ సనాతన ధర్మాలు, ఆధ్యాత్మిక విలువ తెలియజేసేందుకు ప్రతీనెల మృత్యుంజయ హోమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శంకర్, అకడమిక్ కోఆర్డినేటర్ సునయన, డిప్యూటీ చైర్‌పర్సన్లు, లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

◆ 7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మలత గురువారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

◆ రక్తదానం చేసిన కానిస్టేబుల్

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఓ కానిస్టేబుల్ స్పందించి రక్తదానం చేశాడు. దుబ్బాకకు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చికిత్స సమయంలో ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరం ఉందనే విషయం తెలుసుకున్న ఏఆర్ కానిస్టేబుల్ కృష్ణబాబు స్పందించి పట్టణంలోని ఓ బ్లడ్‌బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు. కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక

కోహెడ(హుస్నాబాద్): బాబు జగ్జీవన్‌రావు, అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని గురువారం స్థానిక అంబేద్కర్ భవనంలో అంబేద్కర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాగుల శ్రీనివాస్, సభ్యులుగా తలారి నర్సయ్య, బందెల రాజమౌళి, ఆరె జగదీశ్, ర్యాగటి బాబు, బిట్ల మల్లేశం, ఎత్తి నగేశ్, కిష్టస్వామి ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా ధర్మయ్య, రాజయ్య, సలహాదారులుగా పద్మయ్య, బాలకిషన్, వెంకటస్వామిని ఎన్నుకున్నారు.

◆ బాబు జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడు

హుస్నాబాద్: పిన్న వయస్సులోనే మంత్రి పదవి చేపట్టి, ఉప ప్రధానిగా ఎదిగిన బాబు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి పురస్కరించుకొని గురువారం కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

◆ రైతుదీక్షను విజయవంతం చేయండి

గజ్వేల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు నిర్వహించతలపెట్టిన రైతుదీక్షను విజయవంతం చేయాలని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణ మాఫీ, కౌలు రైతులకు రూ.15 వేల రైతుబంధు, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ తదితర హామీలను ఇచ్చిందన్నారు.

◆ తేనెటీగల దాడి: ముగ్గురికి గాయాలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారు సత్యసాయి గురుకుల పాఠశాల సమీపంలో వాహనదారులపై గురువారం తేనెటీగలు దాడి చేశాయి. ముత్తన్నపేటకు చెందిన రాగేటి బుచ్చయ్య, బెజ్జంకికి చెందిన రామచంద్రం, అంజయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారికి బెజ్జంకి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సచేసి సిద్దిపేట సివిల్ ఆస్పత్రికి తరలించారు.

◆ మాదిగలకు ఎంపీ సీట్లు కేటాయించాలి

సిద్దిపేటకమాన్: అత్యధిక జనాభాగల మాదిగలకు అధికార కాంగ్రెస్ పార్టీ రెండు ఎంపీ సీట్లను కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ సీట్లు కేటాయించకపోవడంతో సిద్దిపేట పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మూడు పార్లమెంట్ స్థానాలు ఎస్సీ రిజర్వుడ్ ఉంటే ఒక్క స్థానం కూడా మాదిగలకు కేటాయించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో అశోక్, ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.

బీజేపీ రైతు దీక్ష



అంతక్కపేట రైతు దీక్ష చేస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని అంతక్కపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో క్వింటాల్ ధాన్యానికి రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రూ.2200కు అదనంగా రూ.500 బోనస్ కలిపి మొత్తం రూ.2700 మద్దతు ధరను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కోహెడ(హుస్నాబాద్): బండి సంజయ్ దీక్షకు మద్దతుగా మండల బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఇంటి ఆవరణలో రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.